ANN తెలుగు

Follow: @ANNTELUGU

30-07-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 207 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## విద్యార్థులపై దాడికి అమిత్ షాదే బాధ్యత

- లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ.
- క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు..

**ఢిల్లీ, మహా :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడి ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యత వహించాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనపై అమిత్ షా దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై మాట్లాడటం తన హక్కు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే లోక్‌సభలో తనకు మాట్లాడే

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### మగాడు మగాడిలా మాట్లాడాలి

- ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా?
- వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి ఫైర్

02



### నిరుద్యోగి.. పనికిరానివాడు

- నేను ఆ వయసులో రెండునేషనల్ అవార్డులు సాధించా
- కాక్రోచ్ పై మరోసారి కంగనా ఫైర్

02



### ప్రభుత్వ పాఠశాలల్లో చికెన్ బిర్యానీ

- విజయ్ సర్కార్ సంచలన ప్రతిపాదన
- దేశంలోనే తొలి రాష్ట్రం

02



### తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఊరట

- పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్
- సీతారామా, పాలమూరు, సీతమ్మసాగర్ కు ఓకే

02



## పంద్రాగస్టు తర్వాతే

### వర్కింగ్ ప్రెసిడెంట్లు, పెండింగ్ మంత్రి పదవులు, నామినేటెడ్ అన్నీ అపుడే

- సర్ తర్వాతే సమీక్ష
- సర్ ను నిర్లక్ష్యం చేస్తే ఎంతటివారైనా మూల్యం చెల్లించాల్సిందే
- పీసీసీతో సహా ఏ నామినేటెడ్ పోస్ట్ అయినా ఆ తర్వాతే
- తెలంగాణ కాంగ్రెస్ నేతలకు తేల్చిచెప్పిన కేసీ వేణుగోపాల్
- ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, ఉత్తమ్ సహా కీలక నేతలు హాజరు
- పనిచేయని డీసీసీలకు షాక్

**ఢిల్లీ, మహా :** సర్ ను ప్రతిఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని, సర్ తర్వాతనే ఎలాంటి పదవులపైనయినా చర్చిస్తామని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పింది. వర్కింగ్ ప్రెసిడెంట్లు, పెండింగ్ మంత్రిపదవులు, నామినేటెడ్ ఛైర్మన్లు, ఇతరత్రా పదవులు, త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీలు అన్నింటిపైనా పంద్రాగస్టు తర్వాత మాట్లాడుకుందామని, సర్ పూర్తయిన తర్వాత సమీక్ష చేద్దామని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ , పార్టీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ సహా నేతలు కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్ కేసీ వేణుగోపాల్ తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం పార్టీ వ్యవహారాల పై

మిగతా 2వ పేజీలో





### తెలంగాణలో

## కొలువుల జాతర

### 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసిన పోలీసు నియామక మండలి
- సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్ల శాఖలో ఉద్యోగాల భర్తీ



**హైదరాబాద్, మహా :** రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మేరకు పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్లశాఖలో పలు ఖాళీల భర్తీకి సంబంధించి 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. త్వరలో దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామని పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. వివరాలకు టీజీపీఆర్ బి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నియామక మండలి తెలిపింది. త్వరలో దరఖాస్తుల షెడ్యూల్ ను ప్రకటించనున్నట్లు పేర్కొంది. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ఏడాదే దాదాపు 70వేల ఉద్యోగాలు భర్తీచేసినట్లు ప్రకటించగా

మిగతా 2వ పేజీలో



### నా పొలిటికల్ డిజైన్ నవంబర్‌లో చెబుతా

- రాహుల్ కు మాటిచ్చా.. మూడున్నరేళ్ళు ఆగా
- సంగారెడ్డిలో జగ్గారెడ్డి కామెంట్స్

02



### కోల్ స్కామ్ కేసులో మన్మోహన్ కు క్లీన్ చిట్

02

## కమిషన్ల కక్కుర్తి వల్లే బ్యారేజీలు కూలాయి

- బీఆర్ఎస్ తీరుపై ఉత్తమ్ తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం నీరు వాడకుండానే తెలంగాణలో రికార్డు ధాన్యం ఉత్పత్తి..

02





### ఆగస్టు 17 తర్వాత

## భోగాపురం నుంచే విమానయానం

- వైజాగ్ ఎయిర్ పోర్ట్ క్లోజ్
- గెజిట్ విడుదల

03







## మగాడు మగాడిలా మాట్లాడాలి

- ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా?
- వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి ఫైర్

**తిరుపతి, మహా :** నాడు నిండు సభలో కౌరవులు ద్రౌపది చీర లాగారని, ధర్మరాజును అవమానించేందుకు వాళ్లు అలా చేశారంటూ వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కుప్పం లో పర్యటించిన ఆమె ద్రౌపది మాత ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీలో చంద్రబాబును నేరుగా ఎదుర్కోలేక ఆడబిడ్డనైన నన్ను లాగి, నా శీలాన్ని శంకించారని ఆరోపించారు. ధైర్యం ఉంటే మగాడు మగాడిగా నిలబడి ప్రత్యర్థిని ఎదుర్కోవాలి కానీ.. ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా అని ప్రశ్నించారు. ఓ స్త్రీ గురించి మాట్లాడే హక్కు ఏ మగాడికి లేదని, ఏ ఆడదానికైనా తాను ఎట్లాంటిదో తనకు మన:సాక్షికి తెలుసని కామెంట్ చేశారు. నాడు వస్త్రాపహరణంలో ద్రౌపదికి శ్రీకృష్ణుడు దిగివచ్చి సాయం చేస్తే.. నేడు చంద్రబాబుకు ప్రజలే దేవుళ్లుగా అండగా నిలబడ్డారంటూ నారా భువనేశ్వరి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ నిండు సభలో తనకు జరిగిన అవమానాన్ని ఎన్నడూ మర్చిపోలేనని, ఇదేమి ఎలక్షన్ క్యాంపెయిన్ కాదన్నారు. సందర్భం వచ్చింది కాబట్టి ప్రజలకు చెప్పాల్సిన అవసరం వచ్చిందని భువనేశ్వరి స్పష్టం చేశారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో చికెన్ బిర్యానీ

- విజయ్ సర్కార్ సంచలన ప్రతిపాదన
- దేశంలోనే తొలి రాష్ట్రం

**చెన్నై:** తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మిల్ లో భాగంగా విద్యార్థులకు వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ పెట్టేందుకు దాదాపు రంగం సిద్ధం చేసింది. ఈమేరకు సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ పథకం అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చికెన్ బిర్యాణీ పెట్టిన రాష్ట్రంగా తమిళనాడు రికార్డు సృష్టించనుంది. సీఎం విజయ్ ఈ సంచలన ప్రతిపాదన అమలుచేసేందుకు సై అన్నట్లు సమాచారం. మధ్యాహ్న భోజన పథకంలో వారానికి ఒకసారి చికెన్ బిర్యానీని చేర్చాలనే ప్రతిపాదన వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల్లో హాజరు శాతం పెంచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లను తగ్గించడం తదితర కారణాలున్నట్లు సమాచారం. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు, విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు పాఠశాలలపై ఆసక్తిని పెంచేందుకు సీఎం విజయ్ ఈ అంశంలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం.

## కోల్ స్కామ్ కేసులో మన్మోహన్ కు క్లీన్ చిట్

**ఢిల్లీ, మహా :** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో అత్యంత సంచలనం సృష్టించిన బొగ్గు బ్లాకుల కేటాయింపుల (కోల్ స్కామ్) కేసులో ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును సుప్రీంకోర్టు బుధవారం ముగించింది. అంతేకాకుండా ఆయనకు విచారణకు హాజరుకావాలంటూ గతంలో ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కూడా రద్దు చేసింది. ఈ కేసులో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సీబీఐ ఇప్పటికే క్లీన్ చిట్ ఇస్తూ ముగింపు నివేదిక (క్లోజర్ రిపోర్ట్) దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జైమాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సీబీఐ నివేదికను ఆమోదించింది. 2024 డిసెంబర్‌లో కన్నుమూసిన మన్మోహన్ సింగ్, ఈ తీర్పుతో యూపీఏ కాలం నాటి అతిపెద్ద క్రిమినల్ కేసు నుంచి అధికారికంగా నిర్దోషిగా విముక్తి పొందారు. సీబీఐ దాఖలు చేసిన ముగింపు నివేదికలను తిరస్కరించడానికి గానీ, ఆయనపై నేరాభియోగాలను స్వీకరించడానికి గానీ ఎలాంటి బలమైన కారణాలు లేవని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# పంద్రాగస్టు తర్వాతే

( మొదటి పేజీ తరువాయి )

కీలకంగా చర్చించారు. సమన్వయం.. లక్ష్యాల సాధన పైన ఆరా తీసారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ఓటర్ల ప్రక్రియ పైన ప్రధాన చర్చ జరిగింది. కొందరు నేతలు సర్ పక్రియను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పార్టీలో భర్తీ చేయాల్సిన పీసీసీ తో సహా ఏ నామినేటెడ్ పదవి అయినా సర్ పక్రియ పూర్తయిన తరువాత మాత్రమే ఆలోచన ఉంటుందని స్పష్టం చేసారు. అందరూ సర్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు ఆ కార్యక్రమం పైనే ఫోకస్ చేయాలని తేల్చి చెప్పారు.

**సర్ పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రత్యామ్నాయ ఆలోచన**

పార్టీ నేతలకు దిశా నిర్దేశం ఎవరైనా సర్ పక్రియ పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యామ్నాయం చూడాలని కేసీ వేణుగోపాల్ నిర్దేశించారు. ఏ ఒక్క ఓటు కూడా నష్టపోకూడదని స్పష్టం చేసారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ (సంఘటన్ సృజన్ అభియాన్) కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. సమీక్షలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ), మండల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల పనితీరు, పార్టీ విస్తరణ కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు వెల్లడించారు. పార్టీలో సమన్వయానికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. పనిచేయని డీసీసీలపై సమీక్ష జరిపి తొలగించాలన్న చర్చ జరిగింది. పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ అంశం సర్ ప్రక్రియ రాష్ట్రంలో పూర్తయిన తరువాత నిర్ణయం తీసుకుందామని వేణుగోపాల్ స్పష్టం చేశారు. సర్ పూర్తయ్యేవరకు నేతలంతా ఒకే పనిపై ఉండాలని నిర్దేశించారు.



# విద్యార్థులపై వేధింపులు ఆపాలి

*** లేదంటే దేశవ్యాప్త ఉద్యమం: అభిజీత్ దీప్కే**



**ఢిల్లీ, మహా**. నీట్ యూజీ2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే త్వరలోనే దేశవ్యాప్తంగా మరోసారి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, తమ భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జి, పెలెట్ గన్స్ వంటి చర్యలు తీసుకోవడం తీవ్రంగా ఖండించారు.జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై అధిక బలప్రయోగం జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. విద్యార్థులను ఉగ్రవాదుల మాదిరిగా పెలెట్ గన్స్‌తో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తమ హక్కులు, భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇలాంటి చర్యలు ప్రభుత్వం చేపట్టకూడదని అన్నారు. వేధింపులు ఇదే విధంగా కొనసాగితే మరోసారి ప్రజల్లోకి వెళ్లి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే కొత్త దశలో ఆందోళనలు ప్రారంభమవుతాయని తెలిపారు.

జెన్‌జెడ్ యువతపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన అభిజీత్ దీప్కే, ఆమె వ్యాఖ్యలను ఎవరూ సీరియస్‌గా తీసుకోరని కొట్టిపారేశారు.

ఇదిలా ఉండగా, ఇటీవల జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ నిరసనలు, 'ఛలో సంసద్' కార్యక్రమం సందర్భంగా రాళ్లతో నిండిన ట్రక్కు కనిపించిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు వివరణ ఇచ్చారు. ఆ ట్రక్కుకు నిరసన కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని పేర్కొన్నారు.


పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, వివాదాస్పదంగా మారిన ట్రక్కును జులై 16న జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో స్వాధీనం చేసుకున్నారు. ఈఈసీఓ వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు గాయపడటంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు భాగంగా ట్రక్కును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో తగిన స్థలం లేకపోవడంతో తాత్కాలికంగా బయట నిలిపినట్లు తెలిపారు.

'ఛలో సంసద్' కార్యక్రమం సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా జులై 20 తెల్లవారుజామున ట్రక్కును అక్కడి నుంచి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. తరలించే ముందు లారీలో ఉన్న రాళ్లను పూర్తిగా ఖాళీ చేసి, అనంతరం వాహనాన్ని మరో సురక్షిత ప్రాంతానికి తరలించామని వివరించారు. ఇది పూర్తిగా చట్టపరమైన, పరిపాలనా ప్రక్రియలో భాగమేనని, దీనికి నిరసనలు లేదా ఏదైనా కుట్రతో సంబంధం ఉందని ప్రచారం చేయడం నిరాధారమని స్పష్టం చేశారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు.

సోషల్ మీడియా వేదికల్లో ధ్రువీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలకు ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా ధ్రువీకరించిన సమాచారాన్నే నమ్మాలని సూచిస్తూ, తప్పుడు ప్రచారాల ద్వారా ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించే వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిరుద్యోగి.. పనికిరానివాడు


- నేను ఆ వయసులో రెండునేషనల్ అవార్డులు సాధించా
- కాక్రోచ్ పై మరోసారి కంగనా ఫైర్



**ఢిల్లీ, మహా :** ట్ పేపర్ లీక్ వ్యవహారంలో జెన్‌జీ నిరసనకారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్‌పై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అతడో పనికిరాని వ్యక్తి అని మండిపడ్డారు. అతడి వయసులో తాను రెండు జాతీయ అవార్డులు సాధించానని తెలిపారు. "ఈ వ్యక్తి (సౌరవ్ దాస్) కోసం నెట్టింట వెతికాను. 28 ఏళ్ల విద్యార్థి అని వచ్చింది. కానీ నాకు నమ్మకం లేదు. అవును.. vనేను గత రెండేళ్లుగానే రాజకీయాల్లో ఉండొచ్చు.. కానీ 20 ఏళ్లుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నా. అతడి వయసులో నేను రెండు జాతీయ అవార్డులు సాధించా. నిజమే పార్లమెంట్ సభ్యురాలిగా నాకు పనిభారం ఎక్కువగా ఉందని అన్నాను. ఎందుకంటే నేను ఎంపీని మాత్రమే కాదు.. దర్శకురాలిగా, నటిగా, నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గా, వ్యాపారవేత్తగా ఎన్నో విధులు నిర్వర్తిస్తున్నా. కానీ, పనికిరాని, నిరుద్యోగి అయిన నీలాంటి వ్యక్తికి... ఏ వయసులోనైనా బిజీగా ఉండటం అనేది ఎప్పటికీ అర్థం కాదు. సౌరవ్.. నీది వ్యక్తిగత సమస్యే. నువ్వు విద్యార్థివి కాదు. ఇకనైనా కొన్ని నైపుణ్యాలు నేర్చుకో" అని కంగనా రనౌత్ మండిపడ్డారు.

## నా పొలిటికల్ డిజైన్ నంబర్ లో చెబుతా

- రాహుల్ కు మాటిచ్చా.. మూడున్నరేళ్ళు ఆగా
- సంగారెడ్డిలో జగ్గారెడ్డి కామెంట్స్



**సంగారెడ్డి, మహా :** ఆనాడు రాహుల్ గాంధీకి మాట ఇచ్చాను కాబట్టే.. ఈ ముదున్నరేళ్ల మా పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల గురించి మాట్లాడలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. "నేనేదైనా మాట్లాడాలనుకుంటే ఢిల్లీ ట్రైన్ ఎక్కి రాహుల్ గాంధీతో మాట్లాడిన తర్వాతే బయటికి వచ్చి మాట్లాడుతా. మనసులో ఒకటి పెట్టుకుని బయట మరొకటి మాట్లాడే వ్యక్తిని కాదు" అంటూ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. "మూడున్నరేళ్ల క్రితం మా పార్టీలో లోపాలు ఉంటే బయట మాట్లాడాను. కార్యకర్తల వ్యవహారం, పార్టీ అంశాలపై అంతర్గతంగా, బహిరంగంగాను చర్చించాను. ఈ మధ్య పీఏసీ మీటింగ్‌లో అంతర్గతంగా మాట్లాడే విషయాలు కూడా బయటికి వస్తున్నాయని సమావేశానికి పోవడమే మానేశాను. పీఏసీ మీటింగ్‌కి వెళ్లి ఉంటే పార్టీలో జరుగుతున్న వ్యవహారాలను ఏఐసీసీ ఇంచార్జ్, సీఎం దృష్టికి తీసుకెళ్లేవాణ్ని. మళ్ళీ నేను మాట్లాడిన అంశాలు బయటకి వచ్చేవి.. అందుకే పోలేదు. ఈ మూడున్నర ఏళ్లుగా ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ, ప్రభుత్వ వ్యవహారాలను ఎక్కడ బహిరంగంగా, అంతర్గతంగా చర్చించలేదు" అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. "ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ 40 మంది కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలిచారు. అందులో నాకు ఆహ్వానం అందింది. ఆ సమావేశంలో రాహుల్ గాంధీతో 15 నిమిషాలు మాట్లాడాను. నేను సంగారెడ్డి రాంనగర్‌లోని రాంమందిర్ నుంచి విద్యార్థి నేతగా నా రాజకీయ ప్రయాణం మొదలై.. నేడు ఢిల్లీలో మీ నివాసానికి వచ్చి మీ ముందు కూర్చునే వరకు సాగిందని చెప్పాను. మీ ముందు ఒక రోజు ఇలా కూర్చొని మాట్లాడాలని అనుకున్నా.. ఇప్పుడు మాట్లాడుతున్నా నేను అనుకున్నది సాధించాను అని చెప్పాను. ..ఏ పార్టీ నుంచి ప్రధాన మంత్రి ఉన్నా అధికారంలో ఉన్నన్ని రోజులే గుర్తుపెట్టుకుంటారని చెప్పా. పదవులతో పని లేకుండా గుర్తు పెట్టుకునే వారిలో మీ కుటుంబమే ఉంటుందని చెప్పా. కానీ రాహుల్ గాంధీ కుటుంబాన్ని దేశ ప్రజలు చిరకాలం గుర్తిపెట్టుకుంటారని కూడా చెప్పాను. రాహుల్ గాంధీ నన్ను పక్కకి పిలిచి ఓ మాట చెబుతాను వింటావా అని అడిగారు. మీకు ఎవరిపై అయిన కోపం ఉంటే మీడియా ముందు మాట్లాడకండి. ఢిల్లీకి వచ్చి నాతో మాట్లాడండి అన్నారు. ఆనాడు రాహుల్ గాంధీకి మాట ఇచ్చాను కాబట్టే.. ఈ ముదున్నరేళ్ళ మా పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల గురించి మాట్లాడలేదు. ..రాజకీయంగా నాకు మనసులో ఓ కోరిక ఉంది. నాకు ఓ పొలిటికల్ డిజైన్ ఉంది. అది నవంబర్‌లో చెబుతా. ఈ మూడు నెలల కాలంలో రాజకీయంగా నాకు ఓ క్లారిటీ వస్తుంది. నాకు ఫ్యామిలీ కంటే పబ్లిక్, పాలిటిక్సే ముఖ్యం. నేను 24 గంటల పాటు పబ్లిక్, పాలిటిక్స్ గురించే ఆలోచిస్తా" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




# తెలంగాణలో కొలువుల జాతర

( మొదటి పేజీ తరువాయి )

, ఎల్బీ స్టేడియం వేదికగా వీరికి నియామకపత్రాలు వివిధదశల్లో అందించారు. ఇపుడు మరో భారీ ప్రకటన ద్వారా నిరుద్యోగుల్లో ఉద్యోగాలపై ప్రభుత్వం ఆశలు రేకెత్తించింది.

ఏయే విభాగాల్లో ఎన్ని ఉద్యోగాలు
ఎస్ఐ(సివిల్) 148
ఎస్ఐ(ఏఆర్)14
టీజీఎస్‌పీ ఎస్ఐ 12
ఎస్ఏఆర్‌సీపీఎల్ ఎస్ఐ 3
ఎస్ఐ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) 23 పోస్టులు

**కానిస్టేబుల్ :** ఎస్ఐ ఉద్యోగాలతో పాటు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి కాడా పోలీసు నియమాక మండలి నోటిపికేషన్ జారీ చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.
కానిస్టేబుల్ (సివిల్) 3,697
కానిస్టేబుల్ ఏఆర్ 1052
పీటీవో కానిస్టేబుల్ 20
కానిస్టేబుల్ మెకానిక్ 7
స్పెషల్ పోలీస్ (ఎస్ఐ) 44
కానిస్టేబుల్ 1,038

**ఫైర్ విభాగంలో :**
స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39,
ఫైర్ ఫైటర్ 751 పోస్టులు
డిప్యూటీ జైలర్ (మెన్) 14
డిప్యూటీ జైలర్ (మహిళ) ఒక పోస్టు
వార్డర్ (మేల్) 196

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

**ఉప్పర్‌పల్లి కోర్టు ఆగస్టు 11 వరకు జ్యుడీషియల్ రిమాండ్.**

**హైదరాబాద్, మహా**

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పర్‌పల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మంగళవారం అరెస్టు చేసిన ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు బుధవారం మధ్యాహ్నం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 11 వరకు రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

విచారణ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి తరపు న్యాయవాది వాదిస్తూ, తమ క్లయింట్‌కు ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 35(3) నిబంధనలను పోలీసులు ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర విచారణ జరపకుండానే ఆయనను సస్పెండ్ చేయడం చట్టబద్ధం కాదని, సరైన ఆధారాలు లేకుండానే అరెస్టు చేసి సస్పెండ్ చేశారని వాదించారు. జాతీయ పోలీస్ అకాడమీలో బాధితురాలు చేసిన ఫిర్యాదులో లైంగిక వేధింపుల అంశం లేదని, తప్పుడు ఫిర్యాదు ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. బాధితురాలిపై తీవ్ర ఒత్తిడి ఉందని, ఇరువురు ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ముందే పరిచయం ఉందని పేర్కొంటూ రిమాండ్‌ను తిరస్కరించాలని కోర్టును కోరారు.

దీనికి ప్రతిగా పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తూ, బాధితురాలి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లైంగిక దాడి జరిగినట్లు బాధితురాలు వాంగ్మూలం ఇచ్చిందని, తనపై శారీరక దాడి కూడా జరిగిందని ఆమె వెల్లడించినట్లు కోర్టుకు వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం రిమాండ్ విధించింది.

పోలీసులు ఉదయం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఇందుకోసం ఉదయ్ కృష్ణారెడ్డిని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి అశోక్‌నగర్‌లోని స్టీల్ బ్రిడ్జ్ పిల్లర్ నంబర్-25 సమీపంలో గతంలో ఆయన అద్దెకు నివసించిన ఇంటికి తీసుకెళ్లి పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు.

మరోవైపు తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో కూడా విచారణ జరిగింది. బాధితురాలికి నోటీసులు జారీ చేయాల్సి ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు కోర్టుకు తెలిపారు. దీంతో బాధితురాలికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఈ నెల 18న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి తదితర ఆరోపణలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఫిర్యాదు నమోదైన రోజే బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమె మెడపై గొంతు నులిమినట్లు గాయాల ఆనవాళ్లు, చెంపపై కమిలిన గాయాలు, ఎడమ కాలి చర్మంపై గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

కేసు నమోదు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అనంతరం హైదరాబాద్ శివారులో ఆయనను అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా చార్మినార్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జ్యోత్స్నను, పర్యవేక్షణ అధికారిగా మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్యను నియమించి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఊరట

- పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్
- సీతారామా, పాలమూరు, సీతమ్మసాగర్ కు ఓకే



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు కీలక ఊరట కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను సుప్రీంకోర్టు చెల్లదని ప్రకటించినప్పటికీ, ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొనడంతో, తెలంగాణలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదనే స్పష్టత లభించింది. కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం ద్వారా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండానే ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించింది. అయితే ఈ విధానం పర్యావరణ పరిరక్షణ చట్టాలు, నిబంధనలకు విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను భర్తీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. చట్టంలో పొందుపరిచిన నిబంధనలను కేవలం ఆఫీస్ మెమోరాండం ద్వారా మార్చడం రాజ్యాంగబద్ధంగా సమంజసం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఇప్పటికే ఆ ఆఫీస్ మెమోరాండం ఆధారంగా మంజూరైన పర్యావరణ అనుమతులను రద్దు చేయబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అనుమతుల పై ఆధారపడి కొనసాగుతున్న లేదా నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులకు ఈ తీర్పు వల్ల ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. దీంతో పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల పనులు యథావిధిగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది.భవిష్యత్తులో చేపట్టే అన్ని కొత్త ప్రాజెక్టులకు మాత్రం ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాల్సి వస్తే, కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేసి, పర్యావరణ చట్టాల పరిధిలోనే నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టబద్ధ ప్రక్రియను పక్కనపెట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. తీర్పుతో తెలంగాణలో సాగుతున్న కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై నెలకొన్న న్యాయపరమైన అనిశ్చితికి తెరపడినట్లు నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో సాగునీటి విస్తరణ, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల పునరుద్ధరణకు కీలకంగా మారనున్నాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పు కారణంగా ఈ ప్రాజెక్టుల అమలులో ఎలాంటి చట్టపరమైన ఆటంకాలు లేకుండా పనులు కొనసాగనున్నాయని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇదిలా ఉండగా, కేసు దర్యాప్తుల భాగంగా

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగాలే

- తప్పుడు ప్రచారాలకు కేంద్రం గట్టి కౌంటర్.
- పీవోకే ఎన్నికలు కంటితుడుపు చర్యలే.
- అక్రమ ఆక్రమణను కప్పిపుచ్చే ప్రయత్నమని విదేశాంగ శాఖ వ్యాఖ్య.




**ఢిల్లీ, మహా.:** జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో వ్యాప్తి అవుతున్న తప్పుడు ప్రచారాలకు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చింది. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రస్తుతం పాకిస్థాన్ అక్రమ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం తన అధికారిక సామాజిక మాధ్యమాల వేదికలపై స్పందించిన ఎంఈఏ, ప్రముఖ అమెరికన్ టీవీ షోలోని ఓ వైరల్ మీమ్‌ను ఉపయోగిస్తూ "నేను మీకు ఇది ఎన్ని సార్లు వివరించాలి?" అనే వ్యాఖ్యతో తప్పుడు ప్రచారాలను ఖండించింది.పదేపదే జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌పై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి ఇదే తమ సమాధానమని విదేశాంగ శాఖ పేర్కొంది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలు కూడా భారతదేశానికి విడదీయరాని భాగాలని స్పష్టం చేస్తూ, పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియ కాదని, అక్రమ ఆక్రమణను సమర్థించుకునేందుకు చేస్తున్న కంటితుడుపు చర్యలేనని విమర్శించింది.పీవోకేలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ అక్కడి ప్రజల నిజమైన ప్రజాస్వామ్య ఆకాంక్షలను ప్రతిబింబించదని ఎంఈఏ పేర్కొంది. ఆ ప్రాంతంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, ఆర్థిక దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనా అణచివేతను ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ విధానాల ఫలితంగానే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో భారీ ప్రజా నిరసనలు జరుగుతున్నాయని వెల్లడించింది.ఓ నెటిజన్ జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారతదేశంలో భాగం కాదని, 2019లో ఆర్టికల్ 370 రద్దుతో భారత్ అక్రమంగా విలీనం చేసుకుందని, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం అది వివాదాస్పద భూభాగమని చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ విదేశాంగ శాఖ ఈ వివరణ ఇచ్చింది. ఆ వాదనలను పూర్తిగా తిరస్కరించిన ఎంఈఏ, జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత సార్వభౌమాధికారంలో విడదీయరాని భాగాలని మరోసారి స్పష్టం చేసింది.ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) మానవ హక్కుల పరిరక్షణ, అరెస్టయిన నిరసనకారుల విడుదల, నమోదైన కేసుల ఉపసంహరణ తదితర డిమాండ్లతో ప్రజలు గత 52 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసనలు ఇటీవల మరింత ఉధృతమయ్యాయి. అధికారులతో జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో వేలాది మంది ముజఫరాబాద్ వైపు మార్చ్‌కు సిద్ధమయ్యారు.

ఈ క్రమంలో రావల్కోట్‌లో నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో పలువురు మరణించగా, అనేక మంది గాయపడినట్లు సమాచారం. జూన్ 5 నుంచి జులై 28 వరకు జరిగిన ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 67కు చేరిందని జేఏఏసీ వెల్లడించింది. మృతులను అమరవీరులుగా పేర్కొంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది.మరోవైపు, పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజల స్వేచ్ఛా సంకల్పాన్ని దెబ్బతీసే విధంగా జరుగుతున్నాయని పీవోకే నాయకులు ఆరోపిస్తున్నారు. అరెస్టులు, బెదిరింపులు, భారీ భద్రతా బలగాల మోహరింపుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రావల్కోట్‌లో జరిగిన కాల్పుల ఘటనపై తక్షణమే స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా పాకిస్థాన్ అధికారులను కోరింది.

# ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం

**వైజాగ్ ఎయిర్ పోర్ట్ క్లోజ్ గెజిట్ విడుదల**



ఉత్తరాంధ్ర ప్రతినిధి, మహా : విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ప్రకటించింది. 30 ఏళ్లపాటు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని.. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది. ఇప్పటి వరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.

**అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం**

జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మించిన భోగాపురానికి విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పుడు కేంద్రం దాన్ని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# ఆర్‌సీబీకి చారిత్రక ఘనత.

- 300 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ దాటిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీ.

**ఢిల్లీ, మహా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 300 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను అధిగమించిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీగా నిలిచి మరో మైలురాయిని అందుకుంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకీ విడుదల చేసిన '2026 ఐపీఎల్ వాల్యుయేషన్ స్టడీ' నివేదిక ప్రకారం, ఆర్‌సీబీ బ్రాండ్ విలువ 16 శాతం పెరిగి 312 మిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో ఐపీఎల్ మొత్తం బ్రాండ్ విలువ తొలిసారిగా 20.6 బిలియన్ డాలర్లకు చేరి ప్రపంచ క్రీడా లీగ్‌లలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది.2026 సీజన్‌లో ఆర్‌సీబీ పురుషుల జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లోనూ టైటిల్ సాధించడం, ప్రపంచవ్యాప్తంగా అభిమానుల ఆదరణ మరింత పెరగడం, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య ఒప్పందాల విస్తరణ వంటి అంశాలు బ్రాండ్ విలువ పెరగడానికి ప్రధాన కారణాలని నివేదిక వెల్లడించింది. జట్టు ప్రదర్శనతో పాటు మార్కెటింగ్ వ్యూహాలు, డిజిటల్ వ్యాపార విస్తరణ కూడా ఆర్‌సీబీ విలువను కొత్త స్థాయికి తీసుకెళ్లినట్లు పేర్కొంది. బ్రాండ్ విలువల జాబితాలో 264 మిలియన్ డాలర్లతో ముంబయి ఇండియన్స్ రెండో స్థానంలో నిలవగా, 245 మిలియన్ డాలర్లతో కోల్‌కతా నైట్ రైడర్స్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ 244 మిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. మహేంద్ర సింగ్ ధోని జట్టులో లేకపోవడం, 2026 సీజన్‌లో వరుస పరాజయాలు ఎదుర్కోవడం సీఎస్‌కే బ్రాండ్ విలువపై ప్రభావం చూపినట్లు నివేదిక విశ్లేషించింది. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వరుస స్థానాల్లో నిలిచాయి.ఐపీఎల్ బ్రాండ్ విలువ గత కొన్నేళ్లుగా వేగంగా పెరుగుతోందని నివేదిక వెల్లడించింది. 2023లో 15.4 బిలియన్ డాలర్లుగా ఉన్న ఐపీఎల్ విలువ 2024లో 16.4 బిలియన్ డాలర్లకు, 2025లో 18.5 బిలియన్ డాలర్లకు పెరిగి, 2026 నాటికి 20.6 బిలియన్ డాలర్లను చేరుకుంది. మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, టికెట్ విక్రయాలు, డిజిటల్ ప్రసారాల ద్వారా 2026 సీజన్ ఆదాయం 1.8 బిలియన్ డాలర్లను దాటే అవకాశముందని నివేదిక అంచనా వేసింది.

# మానవ-ఏనుగు సంఘర్షణలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ప్రజలకు అంకితం చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.**



**అమరావతి, మహా.**వన్యప్రాణుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని, మానవఏనుగు సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. బుధవారం వర్చువల్ విధానంలో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ప్రారంభించిన ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవఏనుగు ఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా ఈ ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. అటవీ ప్రాంతాల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న పరిస్థితులు చాలాకాలంగా కొనసాగుతున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉందని, ఉత్తరాంధ్ర పర్యటన సందర్భంగా స్థానిక రైతులు, ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఆధునిక సాంకేతికతతో గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉత్తరాంధ్రలో మానవఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మనుషులు, ఏనుగులు పరస్పర సామరస్యంతో జీవించే పరిస్థితులను కల్పించడంలో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అందుకే ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రజలు అందించిన సహకారాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని గౌరవించి నాలుగు కుంకీ ఏనుగులను ఎంతో ఆప్యాయతతో ఆంధ్రప్రదేశ్‌కు పంపించడం వారి స్నేహభావానికి నిదర్శనమని కొనియాడారు. ఏనుగులను అందించడం అంటే తమ సంపదను పంచుకున్నట్టేనని కర్ణాటక ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. అలాంటి విలువైన సహకారాన్ని తెలుగు ప్రజల భద్రత కోసం అందించిన కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలకు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రతకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శాస్త్రీయ విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగంతో అటవీ ఏనుగుల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారాలు అమలు చేస్తామని తెలిపారు. గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె. అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అటవీ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**సీఈవో సుదర్శన్ రెడ్డి**




హైదరాబాద్, మహా: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కేవలం తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడానికేనని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఆగస్టు 3వ తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 76 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే వంద శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధితో పాటు రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రక్రియను వేగవంతం చేసి ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.డిజిటలైజేషన్ పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఈవో హెచ్చరించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లన్నీ సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాజకీయ పార్టీలతో నిర్వహించే సమావేశాలను తప్పనిసరిగా వీడియో రికార్డు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కూడా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని సుదర్శన్ రెడ్డి మరోసారి స్పష్టం చేస్తూ, ప్రజలు అపోహలకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు.




# పురావస్తు శాఖ భూములను డిమార్కేషన్ చేసి రక్షణ చర్యలు చేపట్టాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా;** వరంగల్ జిల్లాలోని పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆధీనంలోని భూములను డిమార్కేషన్ చేసి, వాటి రక్షణకు అవసరమైన మ్యాపింగ్ ను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భారత పురావస్తు సర్వే ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పురావస్తు శాఖకు చెందిన భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి డిమార్కేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా భూముల పరిరక్షణకు సమగ్ర మ్యాపింగ్ ను రూపొందించి, ఆక్రమణలకు తావులేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పురావస్తు వారసత్వ సంపదను సంరక్షించడం ప్రతి శాఖ బాధ్యత అని పేర్కొన్న జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డి ఆర్ ఓ విజయ లక్ష్మి, ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు,జిల్లా స్పోర్ట్స్ మరియు టూరిజం ఇంచార్జ్ అధికారి అనిల్ మరియు పురావస్తు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**ఢిల్లీ, మహా:** మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై శక్తివంతమైన సైనిక చర్య తప్పదని హెచ్చరిస్తూ, టెహ్రాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన ఓ ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మన శత్రువులను అత్యంత ఘోరంగా దెబ్బకొడతాం. వారికి గట్టి గుణపాఠం చెబుతాం" అని వ్యాఖ్యానించారు.ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి పలు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ అప్రమత్తమై అన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా కూల్చివేసినట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సైనికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. దాడి నేపథ్యంలో మిడిల్ ఈస్ట్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి

# రైతులు–విద్యార్థుల ఉమ్మడి పోరాటానికి సన్నాహాలు


**ఢిల్లీ, మహా :** రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకొచ్చి కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఉమ్మడి ఉద్యమం చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రకటించింది. ఈ దిశగా రైతు సంఘాలతో చర్చలు ప్రారంభించిన పార్టీ ప్రతినిధులు, భవిష్యత్ కార్యాచరణపై మంతనాలు సాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో సీజేపీ ప్రతినిధి అశుతోష్‌తో పాటు పలువురు విద్యార్థి నేతలు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) జాతీయ నాయకుడు రాకేశ్ టికాయత్‌ను మంగళవారం కలిశారు. ఈ సమావేశంలో రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి దేశవ్యాప్తంగా సంయుక్త ఉద్యమానికి రూపకల్పన చేయడం, ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం.సమావేశం అనంతరం అశుతోష్ మాట్లాడుతూ.. దేశంలో రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్తంగా పోరాటం నిర్వహించాలని భావిస్తున్నామని తెలిపారు

# కే కే కన్వెన్షన్ ఇదేం విడ్డూరం..

## కల్యాణ మండపమట! పంచాయతీ రికార్డుల్లో మాత్రం 'ఇల్లే'నట!

- లక్షల విలువైన కమర్షియల్ పన్నులకు గండి.. కేవలం రూ. 5 వేల రసీదుతో సరిపెట్టిన వైనం!
- నిబంధనలు లేవు.. అనుమతులు లేవు.. రేకుల షెడ్డులో సాగుతున్న భారీ 'కేకే కన్వెన్షన్' వ్యాపారం!
- కాగితాల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా.. అక్రమాలకు అండగా నిలుస్తున్న అధికారులు ఎవరు?




**కాకినాడ మహా ప్రతినిధి :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం మెయిన్ రోడ్డు లో కేకే కన్వెన్షన్ లో ఒక పక్క చూస్తే వందలాది మందితో పెళ్లిళ్లు, శుభకార్యాలు, రాజకీయ పార్టీ సమావేశాలు, బర్త్డే పార్టీలు, వాణి ఫంక్షన్లు జరుగుతుంటాయి.. ఏసీ కళ్యాణ మండపం గదులను అద్దెలకు ఇస్తూ రోజుకు వేలాది రూపాయలు వసూలు చేస్తుంటారు. కానీ, ప్రభుత్వ రికార్డులు తీసి చూస్తే మాత్రం అక్కడ అసలు కల్యాణ మండపమే లేదట! అదొక సాదాసీదా నివాస గృహమట! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఎ.అన్నవరం గ్రామపంచాయతీ పరిధిలో నడుస్తున్న "కేకే కన్వెన్షన్ & రూమ్స్" అక్రమ వ్యాపార భాగోతంలో ఇప్పుడు ఇదే నిజమని సాక్ష్యాలతోసహా స్పష్టమవుతోంది. కనీస టౌన్ ప్లానింగ్ అనుమతులు లేని ఒక రేకుల షెడ్డును, అధికారుల అండదండలతో రికార్డుల్లో కేవలం ఒక సాధారణ "ఇల్లు" గా చూపించి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు.

**'ఇల్లు' పేరుతో పన్ను దారి మళ్లింపు..**

నిబంధనల ప్రకారం వాణిజ్య పరంగా ఈవెంట్లు జరిపే కమర్షియల్ కల్యాణ మండపాలకు, వాటి విస్తీర్ణం బట్టి వేలల్లో, లక్షల్లో కమర్షియల్ అసెస్మెంట్ పన్ను విధించాలి. కానీ, ఈ కేకే కన్వెన్షన్ యాజమాన్యం అధికారులతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, సదరు భవనాన్ని ఒక నివాస గృహంగా రికార్డుల్లో నమోదు చేయించింది. ఐదు వేలతో సరిపెట్టారు: 2024, 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ భారీ వాణిజ్య సముదాయానికి (డోర్ నంబర్ 6342, అసెస్మెంట్ నంబర్ 2263) గ్రామపంచాయతీ వారు కేవలం రూ. 5,833 పన్ను మాత్రమే వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ సొమ్ము లూటీ: చట్టప్రకారం కమర్షియల్ బిల్డింగ్‌గా దీనిని పరిగణించి ఉంటే, ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజులు, కమర్షియల్ పన్నుల రూపంలో ప్రతి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వచ్చేది. కానీ, ఇక్కడ పన్నును "ఇల్లు" కేటగిరీ కిందకు మార్చి ప్రభుత్వ సొమ్మును అడ్డగోలుగా నొక్కేస్తున్న వైనం స్పష్టమవుతోంది.కాగితాల్లో ఇల్లు.. కరెంటుకు మాత్రం ఫంక్షన్ హాలా?

ఇక్కడే అధికారుల మాయాజాలం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు పంచాయతీ పన్ను రసీదులోనేమో దీనిని "ఇల్లు" అని రాశారు. కానీ, ఇదే పంచాయతీ కార్యదర్శి విద్యుత్ శాఖకు ఇచ్చిన ఎన్ఓసీలో మాత్రం "ఏసీ షీటెడ్ ఫంక్షన్ హాల్" అని రాసి, దానికి కమర్షియల్ హైలోడ్ కరెంటు మరియు ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ ఇవ్వాలని సిఫార్సు చేయడం గమనార్హం.

రికార్డుల్లో ఇల్లుగా ఉన్న భవనానికి విద్యుత్ శాఖ అధికారులు కమర్షియల్ కేటగిరీ కింద భారీ ట్రాన్స్ఫార్మర్ లైసెన్స్ ఏ రూల్ ప్రకారం మంజూరు చేశారు?

పంచాయతీ రికార్డుల్లో పన్ను తక్కువ కట్టడానికి "ఇల్లు" అని, విద్యుత్ లోడ్ ఎక్కువ పొందడానికి "ఫంక్షన్ హాల్" అని రాసినా.. ఉన్నతాధికారులు దీనిని ఎందుకు కళ్ళు మూసుకుని వదిలేశారు?

వాణిజ్య పన్నుల శాఖకు కనపడని భారీ టర్నోవర్..

భవనాన్ని రికార్డుల్లో ఇల్లుగా చూపించడం వల్లే వీరు వాణిజ్య పన్నుల శాఖ నుండి మరియు జీఎస్టీ (పరిధి నుండి కూడా చాలా సులభంగా తప్పించుకుంటున్నారు.

**జీఎస్టీ ఉల్లంఘన:** జీఎస్టీ చట్టం ప్రకారం సేవారంగంలో రూ. 20 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన ప్రతి సంస్థా ఖచ్చితంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ఈ కన్వెన్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయం ఆ పరిమితిని ఎప్పుడో దాటినా.. కనీస భవన నిర్మాణ ప్లానే లేని ఈ రేకుల షెడ్డుకు జీఎస్టీ కనెక్షన్ ఉందా లేదా అనేది అనుమానమే.

ఇల్లు పేరుతో సాగుతున్న ఈ అక్రమ కన్వెన్షన్ హాల్ టర్నోవర్ మొత్తాన్ని నల్లధనంగా మారుస్తూ, ప్రభుత్వానికి కట్టాల్సిన ఒక్క రూపాయి పన్ను కూడా కట్టకుండా యాజమాన్యం యథేచ్ఛగా దోపిడీ చేస్తోంది.

**ప్రాణాలతో చెలగాటం..**

ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం ప్రకారం పబ్లిక్ కూడే ఫంక్షన్ హాళ్లకు ఫైర్ సేఫ్టీ NOC తప్పనిసరి. కానీ, ఈ రేకుల షెడ్డుకు ఎలాంటి అత్యవసర ద్వారాలు లేవు. రేకుల షెడ్డుకు ఆనుకుని తగినంత సెట్ బ్యాక్ లేకుండా ట్రాన్స్ఫార్మర్ ఉంచడం వల్ల భవిష్యత్తులో ఏదైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే వందలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అలాగే సరైన పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఉన్నతాధికారులు స్పందించాలి:

నిబంధనల ప్రకారం అనధికారిక కట్టడాలకు వాణిజ్య కనెక్షన్లు గానీ, అనుమతులు గానీ ఇవ్వకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మరి ఏ రికార్డులను చూసి ఈ కమర్షియల్ ట్రాన్స్ఫార్మర్‌కు, ఫంక్షన్ హాల్ నిర్వహణకు స్థానిక యంత్రాంగం మరియు విద్యుత్ శాఖ సహకరించాయో ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ విధంగా రికార్డులను తారుమారు చేసి, ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల గండి కొట్టిన స్థానిక పంచాయతీ సిబ్బందిపై, విద్యుత్ శాఖ అధికారులపై మరియు కేకే కన్వెన్షన్ యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ గారు మరియు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తక్షణమే క్రిమినల్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చీరలో పాయల్ అందాల విందు

సౌత్ ఇండియన్ నటి పాయల్ రాధాకృష్ణ మరోసారి తన అందం, అభినయంతో పాటు సంప్రదాయ శైలిలో కనిపించి సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న మిర్రర్ సెల్ఫీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఊదా రంగు చీరలో రాజసంగా మెరిసిన పాయల్ ఫొటోలు నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.బంగారు జరీ అంచులతో నాజూకుగా నేసిన ఊదా రంగు చీరకు మ్యాచింగ్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జత చేసి పాయల్ ఎంతో హుందాగా కనిపించింది. సంప్రదాయ దక్షిణాది శైలిని ప్రతిబింబించేలా మల్లెపూలతో జడను అలంకరించుకోవడం, చిన్న స్టడ్ చెవిపోగులు, చేతినిండా మ్యాచింగ్ గాజులు ధరించడం ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. సహజమైన చిరునవ్వు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఎలాంటి అతిశయోక్తి లేకుండా సింపుల్‌గా కనిపించినా, ఆమె స్టైల్ అభిమానులను ఫిదా చేసింది. పాయల్ రాధాకృష్ణ సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉంటూ తన ఫోటోషూట్లు, సినిమా అప్‌డేట్లు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఈసారి ఆమె సంప్రదాయ వేషధారణలో కనిపించడంతో అభిమానులు "ట్రెడిషనల్ బ్యూటీ", "ఎలిగెంట్ లుక్", "చీరలో మరింత అందంగా ఉన్నారు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినీ ప్రయాణంలోనూ పాయల్ రాధాకృష్ణ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటోంది. భిన్న, నిమ్మెల్లారా ఆశీర్వాద వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఆమె, ఆ తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంది. ఇటీవల విడుదలైన *ప్రసన్న వదనం*, అలా నిన్ను చేరి, చౌర్య పాఠం* చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించి నటిగా తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో పాపం ప్రతాప్, మిస్టర్ వర్క్ ఫ్రం హోమ్ వంటి ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న పాయల్ రాధాకృష్ణ, గ్లామర్‌తో పాటు నటనకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ దక్షిణాది చిత్రసీమలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది. అందం, అభినయం, సంప్రదాయం కలగలిసిన ఆమె వ్యక్తిత్వమే అభిమానులను మరింత దగ్గర చేస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# రాయల్ లుక్‌లో మెరిసిన సిద్ధార్థ్‌అదితి.. క్యూట్ కెమిస్ట్రీకి ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్‌లో మహా సముద్రం సినిమా ద్వారా పరిచయమైన సిద్ధార్థ్, అదితి రావు హైదరి ఆ తర్వాత ప్రేమలో పడి వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ఈ జంట ఇప్పుడు సినీ అభిమానులే కాకుండా ఫ్యాషన్ ప్రేమికుల దృష్టినీ ఆకర్షిస్తోంది. తాజాగా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జయంతి రెడ్డి నిర్వహించిన గ్రాండ్ ఫ్యాషన్ షోలో ఈ క్యూట్ కపుల్ షోస్టాపర్లుగా ర్యాంప్ వాక్ చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజకుమారుడు, రాజకుమారిలా కనిపించిన వీరిద్దరూ తమ రాయల్ లుక్, అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.ఈ ఈవెంట్‌లో అదితి రావు హైదరి సంప్రదాయం, ఆధునికత కలగలిసిన అద్భుతమైన డిజైనర్ దుస్తుల్లో కనిపించారు. గోల్డ్, బేజ్ రంగుల కలయికలో రూపొందించిన హెవీ ఎంబ్రాయిడరీ పెప్లమ్ బాడీస్‌తో పాటు జర్దోజీ వర్క్, పూసల అలంకరణతో రూపొందించిన షరారా స్కర్ట్‌ను ధరించి ర్యాంప్‌పై నడిచారు. మినిమల్ జ్యువెలరీ, హుందాతనంతో కూడిన స్టైలింగ్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. సిద్ధార్థ్ కూడా అదితి దుస్తులకు సరిపోయేలా బేజ్ కలర్ హెరిటేజ్ షేర్వానీ జాకెట్‌తో పాటు ధోతీ స్టైల్ ట్రౌజర్స్‌ను ధరించి క్లాసీ లుక్‌లో కనిపించారు. మెడలో ధరించిన మల్టీ లేయర్ పెర్ల్, ఎమరాల్డ్ హారం ఆయన రాయల్ లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. సంప్రదాయ దుస్తుల్లోనూ ఆధునిక హుందాతనాన్ని చాటిన సిద్ధార్థ్ స్టైల్ అభిమానులను ఆకట్టుకుంది. జయంతి రెడ్డి రూపొందించిన 'ది గిల్డెడ్ ఎరా' కలెక్షన్‌కు షోస్టాపర్లుగా వచ్చిన ఈ జంట ర్యాంప్‌పై కలిసి నడుస్తుంటే నిజమైన రాజవంశానికి చెందిన జంటను చూస్తున్న భావన కలిగిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరి మధ్య కనిపించిన అన్యోన్యత, సహజమైన చిరునవ్వులు, ఒకరిపై ఒకరికి ఉన్న ఆప్యాయత ర్యాంప్ వాక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఈ ఫ్యాషన్ షోకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు "రాయల్ కపుల్", "పర్‌ఫెక్ట్ కపుల్ గోల్స్", "ఎలిగెన్స్‌కు మరో పేరు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమా ద్వారా ప్రారంభమైన వీరి పరిచయం ప్రేమగా మారి, ఇప్పుడు దాంపత్య జీవితంలోనూ అదే అన్యోన్యతను కొనసాగిస్తున్న ఈ జంట ప్రతి పబ్లిక్ ఈవెంట్‌లోనూ తమ ప్రత్యేక కెమిస్ట్రీతో ఆకట్టుకుంటూనే ఉంది. ఈ ర్యాంప్ వాక్ కూడా సిద్ధార్థ్‌అదితి జోడీకి ఉన్న ప్రత్యేక అభిమానాన్ని మరోసారి నిరూపించింది.

# ఆర్జీవీ సినిమాలే ఎక్కువ మందికి స్ఫూర్తి.. కారణం చెప్పిన అజయ్ భూపతి



టాలీవుడ్ దర్శకుడు అజయ్ భూపతి తన సినీ ప్రయాణం, తనను ప్రభావితం చేసిన దర్శకుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్‌ఎక్స్ 10, మహాసముద్రంమంగళవారం వంటి విభిన్న చిత్రాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, ప్రస్తుతం శ్రీనివాస మంగాపురం సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతుండగా, బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ తెలుగు తెరకు ఎంట్రీ ఇస్తోంది. అలాగే సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. జూలై 30న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అజయ్ భూపతి పలువురు దర్శకుల గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా దర్శక దిగ్గజాలు మణిరత్నం, రామ్ గోపాల్ వర్మల గురించి మాట్లాడుతూ ఇద్దరూ భారతీయ సినీ పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన దర్శకులేనని పేర్కొన్నారు. అయితే ఫిల్మ్ మేకర్స్‌పై ప్రభావం చూపిన విషయంలో రామ్ గోపాల్ వర్మ ముందుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. మణిరత్నం సినిమాలు అత్యున్నత స్థాయి విజన్‌తో రూపొందుతాయని, వాటి నుంచి స్ఫూర్తి పొందాలంటే ప్రత్యేకమైన ఆలోచనా విధానం అవసరమని అజయ్ భూపతి చెప్పారు. ఆయన చిత్రాలను చూసినప్పుడు గొప్ప అనుభూతి కలిగినా, అలాంటి సినిమాలు తాము కూడా తీయగలమనే నమ్మకం వెంటనే రాదని పేర్కొన్నారు. అయితే రామ్ గోపాల్ వర్మ సినిమాలు మాత్రం దర్శకుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. "ఆర్జీవీ సినిమా చూస్తే 'ఇలాంటి సినిమా మనం కూడా చేయొచ్చు' అనే భావన కలుగుతుంది. కానీ ఆయన సినిమాల్లో కనిపించే ఆ సరళతను తెరపై చూపించడం అంత సులభం కాదు. అదే ఆయన ప్రత్యేకత. ఆ సింప్లిసిటీయే నిజమైన కష్టం" అని అజయ్ భూపతి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, సినీ అభిమానులు, ఫిల్మ్ మేకర్స్ మధ్య ఆసక్తికర చర్చకు దారితీశాయి.

# కంగనా వ్యాఖ్యలు దుమారం.. యువతను గౌరవించాలన్న సోనూ సూద్



భారతీయ జనతా పార్టీ ఎంపీ, నటి కంగనా రనౌత్ యువత (జెన్ జెడ్)పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. నీట్‌యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన ఆందోళనల్లో యువత ప్రవర్తనను ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఘాటుగా స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆయన, యువతపై చేసిన వ్యాఖ్యలు సరికావని పేర్కొంటూ, "నటులను స్టార్లుగా నిలబెట్టేది యువతే. వారి అభిమానం, ప్రేమ వల్లే కళాకారులు ఈ స్థాయికి చేరుకుంటారు. అందుకే యువతను ఎప్పుడూ గౌరవించాలి" అని అన్నారు. కంగనా చేసిన వ్యాఖ్యలను ఆయన "సిగ్గుచేటు"గా అభివర్ణించినట్లు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, ఈ వివాదంపై కంగనా రనౌత్ స్పందిస్తూ గురుపౌర్ణమి సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాల నుంచి స్ఫూర్తి పొంది ఈ వీడియోను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్న ఆమె, ఇటీవల జరిగిన నిరసనల్లో కొందరు యువత ప్రదర్శించిన ప్రవర్తన సభ్య సమాజం ఆమోదించలేనిదని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని సాధారణ విషయంగా చూడకూడదని కంగనా వ్యాఖ్యానించారు. మాట్లాడే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, అవి ఇతరుల హక్కులు, గౌరవాన్ని దెబ్బతీయకుండా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో జీవించే ప్రతి వ్యక్తి క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పాటించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే, "ఫెమినిజం" పేరుతో కొందరు యువతను బాధ్యతారాహిత్య దిశగా ప్రోత్సహిస్తున్నారని కంగనా విమర్శించారు. గురుపౌర్ణమి సందర్భంగా ద్వేషం, అసభ్య ప్రవర్తనకు దూరంగా ఉండి, గురువుల బోధనలను అనుసరిస్తూ వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని యువతకు ఆమె పిలుపునిచ్చారు. కంగనా, సోనూ సూద్ వ్యాఖ్యలతో ఈ అంశం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. యువత పాత్ర, వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతలపై నెటిజన్ల మధ్య విస్తృత చర్చ కొనసాగుతోంది.



# రామ్ చరణ్.. ఉపాసనతో ప్రత్యేక పూజలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల కుడిచేతి మణికట్టుకు విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా కోలుకుంటుండగా, ఆపరేషన్ అనంతరం తొలిసారిగా కోయంబత్తూరులోని ప్రసిద్ధ అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సతీమణి ఉపాసన కూడా ఆలయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.రామ్ చరణ్ ఆలయ దర్శనానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సాధారణ దుస్తుల్లో, ప్రశాంతంగా కనిపించిన రామ్ చరణ్‌ను చూసిన అభిమానులు ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ కుడిచేతి మణికట్టుకు సంబంధించిన సమస్య తీవ్రతరం కావడంతో కోయంబత్తూరులోని ప్రముఖ గంగా ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఆపరేషన్‌కు ఆర్థోపెడిక్ వైద్యరంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ ఎస్. రాజశేఖరన్ నేతృత్వం వహించారు. అత్యుత్తమ వైద్యం అందించేందుకు అమెరికాలోని మయామికి చెందిన ప్రముఖ హ్యాండ్ అండ్ రిస్ట్ సర్జన్ డాక్టర్ అలెహాంద్రో బాడియాను ప్రత్యేకంగా కోయంబత్తూరుకు రప్పించి శస్త్రచికిత్స నిర్వహించినట్లు సమాచారం. గతంలో మెగాస్టార్ చిరంజీవికి ఎదురైన క్లిష్టమైన వెన్నెముక సమస్యకు కూడా డాక్టర్ ఎస్. రాజశేఖరన్ విజయవంతంగా చికిత్స అందించారు. అదే నమ్మకంతో రామ్ చరణ్‌కు కూడా ఆయన వైద్య బృందం చికిత్స అందించింది. ప్రస్తుతం రామ్ చరణ్ కోలుకుంటుండగా, త్వరలోనే తన సినిమా షూటింగ్‌లలో పాల్గొనే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034